

# గిరీశం నమస్కార భాణం - 3

బెంగుళూరు బంగారప్పగారు రెండేళ్ళ పండగ లాగించేస్తాననగానే ఒద్దురోయ్ అంటూ అయినవాళ్ళూ, కానివాళ్ళూ కూడా గోల చేశారు. సీయమ్ కుర్చీ ఎక్కి నువ్వు సాధించిందేవిటని నలుగురూ నిల్దీస్తారనీ బెదిరించారు. ఆకుర్చీమీద రెండేళ్ళుండటమే గొప్ప అన్న సంగతి ఈ గిట్టనివాళ్లు మర్చిపోయారన్న మాటే గదా. మాట వరసకి మన వూరే తీసుకుందాం. అయ్యకోనేటిగట్టు దగ్గర ఆడపాప గడకట్టి దానిమీద కెగబాకి గడకొసమీద బొడ్డునమర్చి బోరగిళా పడుకుని కాళ్ళూ చేతులూ బారజాచి కసరజ్జేసి దిగిపోయిస్తే నువ్వేం సాధించేసీవే గుంటకానా అని మనమెవ్వళం ఎద్దేవా చెయ్యలేదే! .... నిజానికా నాలుగైదు నిమిషాల్లో చుట్టూ మూగిన నేలబారు ప్రజగాళ్ళంతా గుడ్లప్ప చెప్పి నోళ్ల బెట్టి చూస్తూ చప్పట్లు కొడుతూ ఆకలి దప్పికలు మర్చిపోయి పక్కవాళ్ళు తమతమ జేబులు కత్తిరించేస్తుంటే కూడా పట్టించుకోలేదు. ఆ గడసాని అయిదారు నిమిషాలు ఆకలిదప్పులు మరిపిస్తే ఈ బంగారుసామి రెండేళ్ళపాటు ఆ కుర్చీమీద కసరజ్జేస్తూ అందరికీ ఆకల్దప్పులూ, అవసరాలూ మరిపించేడు గదా? ఆకలీ, నీరూ ఎవడూ

అడగలేదు గద -- వీడెప్పుడు పడతాడో ఎలా పడతాడో అన్న ఝూసే దప్పు.... ఇంతకన్నేం గావాలని....ఇంతా కన్నా....నందమేమీ అని....

లోగడ దశరథులవారు అయోధ్యని అరవై వేల ఏళ్ళు పాలించి వారికే బోరుకొట్టి రాముల వారికి రాజ్యమిచ్చేసేట్ట .... అప్పట్లో దిగిపో దిగిపో అండాల్లేవుగాని ఆయన దిగుతాననగానే జనం తొందరపడి చప్పట్లు గొట్టేసేరు. పెద్దాయన కనుమానం వచ్చి అడిగేశాట్ట. ఏవర్రా! ఏమిటి నేనంత బోరుకొట్టానా అని. అబ్బెబ్బే కాదు మీరుదిగుతారని కాదు. అబ్బాయిగారు ఎక్కుతున్నందు కీ చప్పట్లూ ఆవటాన్నారుట ప్రజలు--

ఆ ధరిమేణా రాములవారు పదకొండు వేల సంవత్సరాలు పాలించి కుర్చీ దిగడం మర్చిపోయారు. చివరకి స్వర్గం నించి దూర్వాసుడి ద్వారా కబురొచ్చింది. అయ్యా విష్ణుమూర్తిగారూ తవరు పరాకు చిత్తగిస్తున్నారూ, వైకుంఠానికి తిరిగి వచ్చే వేళ దాటి చాలాకాలమైందిస్మండీ అని...

యుగం ఫిరాయించాక ధర్మరాజుల వారు పాతిక ముప్పైయేళ్లు పాలించారు. నూటికి తొంభై మంది కురుక్షేత్రంలో ఖర్చయిపోయినందువల్ల తిండి గింజలకు లోటులేక ఆకలి బాధలు కొన్నాళ్ళు గైరు హాజరు వేశాయ్. ఆ ధరిమేణా వచ్చిన పాదుషాలు మూడు నాలుగు పుంజీల యేళ్ళూ, నెహ్రూగారు నాలుగు పుంజీలూ ఇలా తగ్గిపోతూ వచ్చాయి. మధ్యలో ఆ తెల్ల దొరలు కాస్త నిలకడగా జెండా ఎగరేశారనుకోండి..

ఏతావాతా చెప్పొచ్చేదేవిటంటే అసలు రాజ్యపాలన అనగా ప్రజలు ఆకలిదప్పికలు రూపుమాడంగాదు. ఆకలీ దప్పికా ఎప్పుడూ సూర్యచంద్రుల్లా వుండేవే. వాటిని కాసేపు మరపించి అల్లిబిల్లి గారడీ చెయ్యడవే పరిపాలన. జనాలు వాళ్ళ తిప్పలు వాళ్ళు ఎప్పుడూ పడుతూనే వుంటారు. మళ్లీ గవర్నమెంట్లు పెడుతూనే వుంటారు. అసలీ గవర్నమెంట్లు ఎలా వచ్చాయో తెలుసా....తవరు రాజరికాల రోజులవారు.... అందువల్ల ఇటీవలి సంగతులు దఖలు పరుస్తున్నాను....

అనగనగా ఓ గదిలో రెండరటి పళ్ళూ రెండెలకలూ. రెండే కాబట్టి రెండూ హాయిగా ఇల సాటిలేని జంటలా డూయెట్లు పాడుకుంటూ భోంచేశాయి చెరొక పండూను.

ధరిమేణా పళ్ళు రెండే గాని ఎలకలు ఇరనై జేరాయి. కొట్టుకు చావడం మొదలెట్టాయి. ఇది పనిగాదని పిల్లిని పిలిచి ఓ గవర్నమెంటుపెట్టాయి. పిల్లి చూసింది. ఎలా సర్దినా వీటికి చాలదని చెప్పి తను దిని తన పిల్లలికి పెట్టింది.ఆదీ చాలక పిల్లలేడిస్తే ఓ నాలుగెలకల్ని కూడా లాగించేసింది. మిగతా ఎలకలు అజ్జాసి హడిలి చచ్చి వూరుకున్నాయి. ఆ భయంతో అనక పెట్టిన అరపండులోనే సర్దుకుని సారా తాగి నిదరోయాయి.

అసలు సృష్టిలో మొట్టమొదటి గవర్నమెంటు ఎలా పుట్టిందో తమకు తెలిసే వుంటుంది. దేవతలూ దానవులూ అమృతం కోసం సముద్రాన్ని మధించారు గదా! దేవతలు గడునుగా ఓ గేమాడారు. తాము వాసుకి పాముని తలకేసే పట్టుకుంటామని.... అప్పుడు దానవులు అదేదో గొప్పనుకుని అబ్బే ఆ తలకాయ సైడు మాకే కావాలన్నారు. పొగలూ సెగలూ కక్కే తలని అసురులూ, నీటుగా వున్న తోకని సురలూ పట్టుకు లాగారు. ఆ ముహూర్తం వచ్చింది. పోయి స్తానం జేసి మడిగట్టుకు రండన్నారు అసురుల్ని. మరి మీరో అన్నారు. మేము దేవతలం మాకు చెమట పట్టదు గదా స్తానాలక్కర్లేదు అన్నారు. వాళ్ళు వచ్చేలోపల కుట్ర జేశారు. వీళ్ళు అమృతం తాగితే ఇక చావరూ. కంట్రోలు చెయ్యలేమూ ఎలాగా అని విష్ణుమూర్తిని పిలిచారు. ఆయన అలాక్కానీండని మోహినీ అవతారం ఎత్తాడు. మీరంతా అటూ యిటూ వరసగా కూచోండర్రా నే పంచుతాను అంది మోహిని. అసురులు డంగైపోయి అలాక్కానీమన్నారు. మోహిని మాంచి డాన్సాడుతూ ఒకే కుండలోంచి ఇటు దేవతలకు పాలూ అటు రాక్షసులకు పాపాలూ వడ్డించి పారిపోయింది. అదిగో అదే స్వామీ గవర్నమెంటు....వంద మంది నోరుకొట్టి ఒకళ్ళిద్దరికి శుభ్రంగా మేపడం అంటే తాత్పర్యం ఏమిటి? పాపం నోరు లేని మైనారిటీ వర్గాల్ని ప్రజా బాహుళ్యం అనే రాక్షసుల బారి నుండి కాపాడ్డం....మొన్నమెరికా కాబోయే అధ్యక్షుడు క్లింటన్ చెప్పాడు--పన్నెండేళ్ళుగా రేగనూ బుష్షూ కల్సి-90% జనాభా గాళ్ళని కంట్రోలు చేసి 2% మైనారిటీ వర్గాలకి 7600కోట్ల డాలర్లు అనగా రెండు లక్షల 28 వేల కోట్ల రూపాయలు పన్ను తగ్గించి పెట్టారు. నోరుండి కలముండి రాసే మిడిల్ క్లాస్‌వారనే 8 పెర్సంట్ గాళ్ళకి కాస్త అటూ యిటూగా చిరుతిండి పడేశారు. కడమా 90 మందికీ మనం త్యాగాలు చెయ్యాలీ, జీతాలు తగ్గించుకోవాలీ, ఎక్కువ పన్నుల కట్టాలీ లేపోతే కమ్యూనిజం మళ్ళీ వచ్చేస్తుంది జాగర్తా అని భయం చెప్పారు. మనక్కూడా ఇండియాలో నల్ల

దొరతనాలూ వాళ్ళ కాళ్ల కింద కార్పొరేషన్‌లూ చంకల్లో బాంకులూ ఇలాగే మైనారిటీ వర్గాల సేవలో అహోరాత్రాలు కష్టపడుతున్నాయి. చేతగాని సన్నాసులు దొరికి పట్టుబడి పోతుంటే పొజిషన్ వాళ్ళూ, అపొజిషన్ వాళ్ళూ అంగోలాలో ఆకలీ, సోమాలియాలో చావులూ, దేవుడి గుళ్ళూ గోపురాలూ, రేపులూ, కామావులూ వగైరా గడమీద కసరత్తులు చేసి వాళ్ళని కాపాడుతున్నారు. ముసిలి నాయకులంతా రోజూ పవిత్ర ప్రకటనలు ప్రపంచిస్తున్నారు. శాంతి వర్ధిల్లాలనీ మనం ఐకమత్యంగా వుండాలనీ అబద్ధాలను చెప్పకూడదనీ నిజాలు చెప్పాలనీ ఏది అబద్ధం ఏది నిజం ఏ నిజాన్ని ఏ పాళ్ళలో ఎప్పుడు చెప్పాలీ అనేది సూత్రీకరించడానికి త్వరలోనే కమిటీలను కమీషనులను వేస్తామని అంతేకాక ఆకలి బాధ గురించి వాకబు చేయడానికి 32 కమిషన్‌లను వేసి దేశ దేశాలకు పంపిస్తున్నామనీ చెబుతున్నారు. ఆ మధ్య 700 మందిగల గ్రామానికి 70వేలతో రక్షిత మంచినీళ్ళ పథకం అమలు చెయ్యడంలో మోసాలు దగాలు జరక్కుండా కోటి రూపాయల కర్చుతో ఓ కార్పొరేషన్ పెట్టి దానికి ఛైర్మన్, డిప్యూటీ ఛైర్ పర్సన్ (పర్సన్ అనగా స్త్రీ లెండి) ఎం.డి, సెగట్రీ, డెప్యూటీ, అండర్ సెగట్రీ వగైరాలను నియమించారు. ఇంత జాగర్తపడి చస్తుంటే గిట్టనివాళ్ళు దిగిపో దిగిపో అంటున్నారు మరి.

అబ్బా....వుండు మధురవాణీ....చెప్తే నీగ్గాదూ....గురూజీతో మాట్లాడుతున్నా....

ఏవిటీ? చెప్పమంటారా....ఇదీ ముఖ్యమైందే లెండి. ఈ గవర్నమెంటు లిటిగేషన్‌ల గురించి అనక చెప్తాను. ఈకథ నాది కాదండోయ్ మధురవాణి చెప్పింది.

పై బాపతు మహాసంస్థల్లో ఒక షావుకారుగారు ఆఫీసులో అయిద్దాటి ప్రజాసేవ చేస్తున్నాట్ట. ఠకీమని లైట్లు పోయి ఝుడుసుకున్నాడు. ఆయన గారి సెగట్రీ వెన్ను చరిచింది. అయినా భయం తగ్గలేదు. ఎలాగైతేనేం ఆ పిల్ల కష్టపడి భయం పోగొట్టింది. ఆనాట్నించి రోజూ ఆఫీసులో పేద ప్రజాసేవలో కరెంటుపోడం, ఆయన భయపడ్డం, ఆ పిల్ల ధైర్యం చెప్పడం ఇలా జరిగింది. ఒకనాడు చీకట్లో ఆయన తన రుమాలు తీసుకోబోయి ఆ పిల్ల బాడీని కోటు జేబులో వేసుకు ఇంటికెళ్ళాడు. ఇల్లాలు గొల్లుమంది. ఎవరీ బాడీ ఏమా కథ-అంది. పర్సు తీస్తే అందులో తన ఫోటో వెనకాల ఆ బాడీ పిల్ల బొమ్మ కూడా వుంది. ఆయన అలవాటుకొద్దీ ఈ సంగతిపై ఓ కమిషన్ వేస్తాననబోయి

నాలిక్కరుచుకుని నిజం చెప్పేశాడు. చూడు నాకు 59 ఏళ్ళు. నీకు 52. మనకి ముగ్గురు పిల్లలూ నలుగురు మనవలూను. ప్రకృతి నీకు సుఖాలు చాల్లే అంది. నాకింకా అనలేదు. ఏదో భూత శాంతి కోసం ఆపిల్లని ధైర్యం చెప్పనిస్తున్నా. నీకేం అన్యాయం చెయ్యను. రేపే ఓలక్ష రూపాయల నెక్లెసు, నాలుగున్నర లక్షలు పెట్టి మారుతీ తౌజండూ కొనిపెడతాను. రేపే ఫైవ్‌స్టార్ హోటల్‌కి భోజనానికి తీసుకు వెళ్తాను. సరేనా అన్నాడు. ఆ ఇల్లాలు జాలిపడి సరే అంది. మర్నాడు అన్న ప్రకారం ఆయన నెక్లెసూ, కారూ కొనిచ్చి ఐదు నక్షత్రాల హోటలుకి తీసికెళ్ళాడు. ఆవిడ పొంగిపోయింది. భోజనం ముగిసి ఐస్క్రీం లాగిస్తుండగా అంత దూరంలో తన భర్తగారి నేస్తాన్నీ ఆయనతో ఓ చక్కని గుంట పిల్లనీ చూసింది. హవ్వ! మన రావుగారండీ! పక్కనా పిల్లె వర్తో అంది.

ఈనగారు చిరునవ్వి భార్య వీపు తట్టాడు. చెప్పాగా ఆయనా నాలాటి కేసే....ఆ పిల్ల ఆయన ఫ్రెండు. ఆయనకి వెన్నూ అదీ తట్టి ధైర్యం చెబుతూ వుంటుంది అన్నాడు. అలాగా అంటూ ఆవిడ అటే నాలుగు క్షణాలు పరిశీలనగా చూసింది. మొగుడి జేబులో పర్సు తీసి అందులో తన సవితి ఫోటో చూసింది. మళ్ళీ అటు చూసింది. తృప్తిగా నవ్వింది.

మన సవితే బావుందిస్మండీ అంది కన్నులరమోడ్చి.

ఇట్లు,
గిరీశం

